క్లుప్తంగా

చర్చల సఫలంపై ఆర్టీసీ ఉద్యోగుల హర్షం



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ యాజమాన్యంతో రాష్ట్ర కమిటీ నిర్వహించిన చర్చలు సఫలమవడంపై ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం డిపోలో శుక్రవారం ఉద్యోగులు స్వీట్లు పంపిణీ చేశారు. డిపో కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కాలంలో నిర్వహించిన ఉద్యమాల నేపథ్యంలో ఆర్టీసీ యాజమన్యం పలు సమస్యల పరిష్కారానికి అంగీకారం తెలిపిందన్నారు. డిపో అధ్యక్షుడు బీవీ ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ జె.ఆంజనేయులు, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ రావు, శంకర్, శ్రీదేవి, ఎంవీ రావు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

జి.కొండూరు: కందులపాడు గ్రామం నుంచి మైలవరం మండల పరిధి గణపవరం వరకు ఉన్న ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడటంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'రహ'దారుణం' శీర్షికన సాక్షి కథనం ప్రచురించింది. స్పందించిన వెల్లటూరు గ్రామ పంచాయతీ అధికారులు స్థానికంగా ఇటుక బట్టీలలో ఉన్న ఇటుక ముక్కల వ్యర్థాలతో గుంతలను పూడ్చారు. ఇది తాత్కాలికమే అయినప్పటికీ వాహన చోదకులకు కొంత కాలం పాటు ఇబ్బందులు తప్పనున్నాయి. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నందున రహదారి విస్తరణ పనులు ప్రారంభిస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

యోగాతో మానసిక ఉల్లాసం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగా గురువు లంకే జనార్దన్ అన్నారు. యోగాంధ్రలో భాగంగా కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు యోగా, ధ్యానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయన మాట్లాడుతూ శారీరక, మానసిక రుగ్మతలతో బాధపడుతున్నవారు యోగా ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన మాట్లాడుతూ జూన్ 21 వరకు మున్సిపాల్టీ పరిధిలోని ఐదు ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. డ్వాక్రా మహిళలతో యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం చేయించారు. ఆర్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి కల్యాణం

వీరులపాడు: మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామి వారికి ప్రత్యేకాలంకరణలు, విశేష పూజలు చేశారు. గురువారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అగస్త్య పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తల్లపురెడ్డి రామ్మోహన్ రెడ్డి, అప్పిరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



నందిగామ రూరల్: పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని ఎనిమిదవ వార్డు పరిధిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోరుపంపు నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి రూ.మూడు కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా తాగు, వాడుక నీటికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యురాలు శాఖమూరు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కష్టాల్లోకి కార్డుదారులు

- ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వం మంగళం
- జూన్ 1 నుంచి అమలు చేస్తామని మంత్రి ప్రకటనతో ఆందోళన
- రేషన్ షాపుల వద్ద పడిగాపులు తప్పవని ఆవేదన
- పనులు మానుకొని డిపోల చుట్టూ తిరగాల్సిందేనంటున్న ప్రజలు





ఇంటి వద్దే రేషన్ సరుకులు అందజేస్తున్న మొబైల్ వాహనం (ఫైల్) ; గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్‌షాపు వద్ద సరుకుల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు (ఫైల్)

నూజివీడు: ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. జూన్ ఒకటి నుంచి మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)ల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రేషన్ కార్డుదారులు సరుకుల కోసం మళ్లీ రేషన్ దుకాణాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో వెళ్లి పడిగాపులు పడాల్సిన పరిస్థితులు ఎదురుకానున్నాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను తొలగించడంతో పౌర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు జూన్ నుంచి రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నియోజకవర్గంలో 58 వాహనాలు

నియోజకవర్గంలో రేషన్ దుకాణాలు 170 ఉండగా, ఎండీయూ వాహనాలు 58, రేషన్‌కార్డులు 95,819 ఉన్నాయి. కార్డుదారులు మధ్య, పేద వర్గాలకు చెందిన వారే. ఒక్కో వాహనానికి ఒక ఆపరేటర్, ఒక సహాయకుడు ఉంటారు. ఒక్కో వాహనానికి ప్రభుత్వం నెలకు రూ.21 వేలు ఇస్తుంది. వీటిల్లో వాహనానికి సంబంధించి లోను కింద రూ.3 వేలు, ఆయిల్ ఖర్చుకు రూ.3 వేలు, సహాయకుడికి రూ.5 వేలు, ఆపరేటర్‌కు రూ.10 వేల చొప్పున ఇచ్చారు. ఈ వాహనాలను రద్దు చేయడంతో వాటిలో పనిచేసే ఆపరేటర్లు, సహాయకులు రోడ్డున పడనున్నారు.

నియోజకవర్గంలో రేషన్‌కార్డుల వివరాలు

మండలం	రేషన్ షాపులు	ఎండీయూ వాహనాలు	రేషన్ కార్డులు
నూజివీడు టౌన్	25	10	13,864
నూజివీడు రూరల్	40	14	24,269
ముసునూరు	38	11	18,842
చాట్రాయి	32	11	17,699
ఆగిరిపల్లి	35	12	21,145
మొత్తం	170	58	95,819

రద్దు తగదు



ఇంటి వద్దకే రేషన్ సరుకులు ఇచ్చే విధానాన్ని రద్దు చేయడం తగదు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకొని పాత విధానాన్ని కొనసాగించాలి. జూన్ నుంచి పేదలు, మధ్య తరగతి ప్రజలు పనులకు వెళ్లకుండా రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ప్రజలను ఇబ్బంది పెట్టడం ఎంతమాత్రం సరి కాదు.

–చాట్ల పుల్లారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి, నూజివీడు

ఇంటి వద్దకే రేషన్ ఇవ్వాలి



వాహనాలతో ఇంటింటికీ సరుకుల పంపిణీని నిలిపి వేస్తే రేషన్ సరుకుల కోసం కార్డుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటివరకు ఇంటి వద్దకే వాహనం వస్తుంటే గంటల తరబడి వేచి ఉండే పని లేకుండా మహిళలు రేషన్ సరుకులను తీసుకుంటున్నారు. ఇదే విధానాన్ని అమలు చేయాలి.

–జి.రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, నూజివీడు

2027 వరకు ఒప్పందం ఉన్నా..

వాస్తవంగా 2027 వరకు ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం దీనిని రద్దు చేయడం గమనార్హం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ ఎన్నికలప్పుడు బీరాలు పలికిన కూటమి పెద్దలు ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ఉన్న వారిని తొలగిస్తూ పోతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెద్ద చెరువు ఆక్రమణల పరిశీలన



విస్సన్నపేట పెద్ద చెరువు ఆక్రమణలు పరిశీలిస్తున్న అధికారులు

విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లి రోడ్డులోని పెద్ద చెరువు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో శుక్రవారం అధికారులు పరిశీలించారు. సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలు గుర్తిస్తామని తహసీల్దారు లక్ష్మీ కల్యాణి తెలిపారు. మండలంలోని కొండపర్వలో కూడా ఎటువంటి అనుమతులు లేకుండా సప్లయ్ చానల్ ఆక్రమించి తూరలు వేసి రహదారి ఏర్పాటు చేసుకున్నట్లు కూడా ఫిర్యాదులు అందడంతో అధికారులు పరిశీలించారు. విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు. ఎంపీడీఓ చిన రాట్నాలు, ఆర్ అండ్ బీ జేఈ గాయత్రి పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా నిక్సన్



తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్. నిక్సన్ నియమితులయ్యారు. ఏడాది కాలంగా ఇక్కడ మైలవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో తిరువూరులో ఎక్సైజ్ సీఐగా నిక్సన్ పనిచేశారు. సారా అదుపునకు నవోదయం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తిరువూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. తిరువూరు సీపీఐ నియోజకవర్గ సమితి రెండో మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే చదువుకునే విద్యార్థులందరికీ తల్లికి వందనం కింద ఆర్థిక సాయం అందజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని, రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం ఏమైందని ప్రశ్నించారు. 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు మహిళలందరికీ ఏడాదికి రూ.1500 ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ఎప్పుడు నెరవేరుస్తారో వారికే తెలియడం లేదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం, సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇస్తామన్న ఇళ్లస్థలాలకు ఎప్పటికి మోక్షం కలుగుతుందో అర్థం కావడంలేదన్నారు. తిరువూరులో 1,530 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని, గతంలో చేపట్టిన పక్కా గృహాల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో చేరి తన సొంత అజెండాను పూర్తిగా పక్కన పడేశారని ఎద్దేవా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గా భవాని, సీపీఐ జిల్లా నాయకులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, షేక్ నాగుల్ మీరా, రాయప్ప, పసుపులేటి వెంకయ్య, మేకల డేవిడ్, సుబానీ, వెంకట్రావు, త్యాగరాజు, వనమాలి, రామకృష్ణ, రవి పాల్గొన్నారు. తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యదర్శిగా షేక్ నాగుల్‌మీరాను, మరో 29 మంది కమిటీ సభ్యులను ఈ మహాసభలో ఎన్నుకున్నారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

తిరువూరు: సరస్వతీ నది పుష్కరాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తిరువూరు డిపో నుంచి ఈ నెల 24, 25 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తెలిపారు. రెండు రోజులూ రాత్రి 9 గంటలకు తిరువూరు బస్టాండ్‌లో బస్సు బయల్దేరి ఖమ్మం, మహబూబాబాద్, భూపాల్‌పల్లి మీదుగా కాళేశ్వరం చేరతుందన్నారు. అంతర్వాహినిగా ఉన్న సరస్వతీ నదిలో పుష్కర స్నానానంతరం మహాకాళేశ్వరుని దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణం ఉదయం 9 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. రానుపోను ఒక్కొక్కరికి రూ.1,100 టికెట్ ధర నిర్ణయించామని, ఆన్‌లైన్‌లో ముందుగా టికెట్ బుక్ చేసుకునే సదుపాయం ఉందని చెప్పారు. సర్వీస్ నెంబరు 35036తో ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఇతర వివరాలకు సెల్: 73824 87969, 98856 61835 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రెసిడెన్షియల్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

చాట్రాయి: ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఐదో తరగతి చదివేందుకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఐదుగురు బాలికలు ఎంపికయ్యారు. జనార్దనవరం మెయిన్ స్కూల్‌కు చెందిన బండారు తేజస్విని, దాస్యం రుత్విక, చీపు జాహ్నవి, పలగాని వినీతశ్రీ , చాట్రాయి మెయిన్ స్కూలుకి చెందిన లక్కబోయిన శ్రీవిద్యలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులను ఎంఈఓలు సర్వేశ్వరరావు, బ్రహ్మచారి, ప్రధానోపాధ్యాయులు ఎస్.నరసింహారావు, జి.రాములు అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలపై ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన



ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

ఇబ్రహీంపట్నం: ట్రాఫిక్ నియమ నిబంధనలపై ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులకు ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మణరావు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ ట్రాక్టర్‌లు నడపరాదన్నారు. అతివేగంతో ట్రాక్టర్ నడపడం వలన అత్యవసర పరిస్థితిలో ట్రాక్టర్‌ను ఆపడం సాధ్యం కాదని ఎస్‌ఐ చెప్పారు. ప్రమాదం సంభవిస్తే తీవ్రమైన నష్టం జరుగుతుందని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో నడిపే వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించుకోవాలన్నారు. రహదారుల పక్కన ట్రాక్టర్లు ఎట్టి పరిస్థితిల్లో పార్కింగ్ చేయకూడదన్నారు. వాహనాలు రోడ్డెక్కే సమయంలో బండి రికార్డులతో పాటు డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. యజమానులు లైసెన్స్ ఉన్న డ్రైవర్లకే ట్రాక్టర్లను అప్పగించాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌కు డస్ట్‌బిన్‌ల వితరణ



డస్ట్‌బిన్లు అందజేస్తున్న దంత వైద్యుడు దేవిశెట్టి దినేష్

నూజివీడు: పట్టణానికి చెందిన దంత వైద్యులు దేవిశెట్టి దినేష్ స్థానిక ఆర్టీసీ బస్టాండులో పరిశుభ్రత కోసం డస్ట్‌బిన్లను వితరణగా శుక్రవారం అందజేశారు. 12 పెద్ద డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసినందుకు డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు అందజేశారని, ఇప్పుడు డస్ట్‌బిన్లు అందజేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ దినేష్ మాట్లాడుతూ బస్టాండు ఆవరణను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రయాణికులపై ఉందన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు అనంతలక్ష్మి, సభ్యులు కొప్పోలు రంగారావు, కోలేటి తిరుపతిరావు, ఆర్టీసీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెరువుల్లో మట్టి తవ్వకాలు



నాగులూరులోని చెరువులో పొక్లెయిన్ ద్వారా మట్టిని ట్రాక్టర్‌లలో నింపి రవాణా చేస్తున్న దృశ్యం

మైలవరం: చెరువుల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకుంటూ టీడీపీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారం బలంతో చెరువుల్లో మట్టిని కొల్లగొడుతూ జేబులు నింపుకుంటున్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నేల మెత్తగా మారి సులభంగా తెగుతుండటంతో మట్టి తవ్వకాలు ఎక్కువయ్యాయి. మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం మండలం పాత నాగులూరు మాలపల్లిలోని చెరువులో పొక్లెయిలు పెట్టి వందల సంఖ్యలో ట్రాక్టర్‌లు ఏర్పాటు చేసి మట్టిని తవ్వకుంటున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారి విజయకుమార్‌ను వివరణ కోరగా స్థానికులకు తమ పొలాలు, ఇళ్ల చుట్టూ మెరక చేసుకునేందుకు అనుమతినిచ్చినట్లు తెలిపారు. అయితే అనుమతికి మించి చెరువులో మట్టి తవ్వుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అనుమతి పేరుతో ఇష్టం వచ్చినట్లుగా చెరువులో మట్టిని తవ్వితే పర్యావరణం దెబ్బ తినే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్త సేకరణతో సంపద సృష్టించాలి

డీఎల్‌పీఓ లావణ్యకుమారి



ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్పీఓ లావణ్య కుమారి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించడం ద్వారా చెత్త వ్యర్థాల నుంచి ఎరువులు తయారు చేసి సంపద సృష్టించాలని విజయవాడ డీఎల్‌పీఓ లావణ్యకుమారి అన్నారు. కేతనకొండ గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. వర్మికంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. వ్యవసాయ భూముల్లో వర్మికంపోస్ట్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలపై సర్పంచులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి నళినీ ఆశాలత, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎండీయూ వ్యవస్థ రద్దు నిర్ణయంపై నిరసన



తహసీల్దార్ అబ్దుల్ దరియాకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

మైలవరం: ఎండీయూ వ్యవస్థ రద్దుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరి కాదని రెడ్డిగూడెం ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షుడు మట్టకొయ్య రాజేష్ అన్నారు. ఎండీయూ వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎండీయూ ఆపరేటర్లు మైలవరం, రెడ్డిగూడెంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మైలవరంలో తహసీల్దార్ అబ్దుల్ దరియాకు, రెడ్డిగూడెంలో తహసీల్దార్ సుశీలాదేవికి అందజేశారు. పలువురు మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులకు రేషన్‌ను వారి ఇళ్ల వద్దే అందజేస్తూ సేవలు అందిస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి ఈ వ్యవస్థను రద్దు చేయడం వలన తాము ఉపాధిని కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

ఆన్‌లైన్ శిక్షణ తరగతులు ప్రారంభం

మైలవరం: మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్ఫోసిస్ ల్యాబ్ ఆన్ వీల్స్ ఆన్‌లైన్ శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్ వేదికగా ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడానికి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడానికి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ఏఐ, రోబోటిక్స్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

నూజివీడులో తిరంగా ర్యాలీ



నూజివీడు: భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పట్టణంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని అశువులు బాసిన మురళీనాయక్‌కు నివాళులర్పించారు. బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదంపై జరుపుతున్న పోరాటానికి దేశ ప్రజలందరూ మద్దతు పలకాలన్నారు. నాయకులు మాటూరి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహా పూర్ణాహుతితో ముగిసిన హనుమత్ దీక్షలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో దీక్ష విరమణలు, హనుమత్ జయంతి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో శుక్రవారం మధ్యాహ్నం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠాధిపతి శ్రీదుర్గా ప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు రామకృష్ణ, శిష్యబృందం పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పీఠం కన్వీనర్, ప్రధాన కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాష్ పాల్గొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఆంజనేయ స్వామి వారి మూలవిరాట్‌కు తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దీక్ష విరమణలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదగా భక్తులు దీక్షలను విరమించి, స్వామి వారికి ఇరుముడులను సమర్పించారు. పూర్ణాహుతి అనంతరం దుర్గాప్రసాద్ స్వామిజీ భక్తులను అనుగ్రహ భాషణం చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.